ప్రజాశక్తి

శనివారం 26 ఆగస్టు 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా







జాతీయ రహదారులపై జరిగిన సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి

- నోవాటెల్ నుండి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం
- మంత్రి జోగి, ఎంపి బాలిశౌరి వెల్లడి

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో జాతీయ రహదారులను పూర్తి స్థాయిలో అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. విజయవాడ నగరంలో నోవాటెల్ హోటల్ నుండి నిడమానూరు వరకూ ఫ్లై ఓవర్ నిర్మాణానికి డిపిఆర్ పూర్తయిందన్నారు. పామర్రు - చల్లపల్లి రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కష్ణా నదిపై వంతెన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో జాతీయ రహదారుల అభివద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రగతిపై ఆయా జిల్లాలకు చెందిన శాసనసభ్యులు, జాతీయ రహదారుల అధికారులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి జోగి రమేష్, ఎంపి బాలశౌరి మీడియాతో మాట్లాడుతూ జాతీయ రహదారి 65 పరిధిలోని విజయవాడ - మచిలీపట్నం నాలుగు లైన్ల జాతీయ రహదారి అభివద్ధిపై చర్చించినట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో బందరు పోర్టు పూర్తి కానున్న నేపథ్యంలో విజయవాడ - మచిలీపట్నం (మిగతా 6లో)

విఆర్ఏల అరెస్టు

- వివిధ స్టేషన్లకు తరలింపు
- 25 మందిపై కేసులు

ప్రజాశక్తి - విజయవాడ : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఆర్ఎలు శుక్రవారం తలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎపి విఆర్ఎల యూనియన్ (సిఐటియు) ఇచ్చిన 'చలో విజయవాడ' పిలుపులో మేరకు రాష్ట్రం నలుమూలల నుంచి వందలాది మంది విఆర్ఎలు నగరానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి అనుమతి లేదని హెచ్చరించినా పోలీసుల నిర్బంధాలు, హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా వందలాది మంది విఆర్ఎలు ర్యాలీగా ధర్నా చౌక్‌గా చేరుకునేందుకు ప్రయత్నించారు. విజయవాడ టాస్క్‌ఫోర్స్ ఎడిసిపి రమణమూర్తి నేతృత్వంలో పలువురు సిఐలు, ఎస్ఐలు, 300 మంది వరకు పోలీసు సిబ్బంది ధర్నా చౌక్ ప్రాంతంలో బందోబస్తు నిర్వహించి ధర్నా చౌక్ వద్దకు విఆర్ఎలను రానీయకుండా అడ్డుకున్నారు. తాలూకా సెంటర్, ప్రెస్‌క్లబ్, లెనిన్ సెంటర్, బిఆర్‌టిఎస్ రోడ్డు, సత్యనారాయణపురం పోలీస్టేషన్, రైల్వేస్టేషన్, పిఎన్ బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మొహరించిన పోలీసులు రోప్‌వే సాయంతో విఆర్ఎలను ముందుకు కదలనీయకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో విఆర్ఎలు, పోలీసుల మధ్య పెద్దఎత్తున పెనుగులాట చోటుచేసుకుంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విఆర్ఎలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు దొరికిన వారిని దొరికినట్లుగా అదుపులోకి తీసుకున్నారు. సుమారు 1000 మందిని అదుపులోకి తీసుకోగా, 400 మందిని అరెస్టు చేసి వాహనాల్లో నగరంలోని వన్‌టౌన్, భవానీపురం, కృష్ణలంకలోని వాసవి కళ్యాణమండపం, గవర్నర్‌పేట తదితర పోలీస్టేషన్ల పరిధిలోని ఆయా షెల్టర్లకు తరలించారు. సుమారు 25 మందిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల అదుపులో ఉన్న వారిని మధ్యాహ్నం తర్వాత విడుదల చేసినట్లు ఆయా పోలీస్టేషన్ల సిఐలు తెలిపారు.



వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో విఆర్ఏలు

ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - భవానీపురం : బస్సుల్లో, రైళ్లలో వచ్చిన విఆర్ఎలను మార్గమధ్యంలోనే పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు 33 మందిని, భవానీపురం పోలీస్‌స్టేషన్‌కు 88 మందిని తరలించారు. సాయంత్రం 5 గంటలకు వారిని సొంతపూచీకత్తుపై విడుదల చేసినట్లు సిఐలు సురేష్ రెడ్డి, సలాం తెలిపారు.

రంగన్నగూడెం ఘటనలో

టిడిపి నేతలపై కేసులు నమోదు

ప్రజాశక్తి - హనుమాన్‌జంక్షన్ : టిడిపి జాతీయ ప్రధాన నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలో గురువారం జరిగిన ఘర్షణపై పలువురు టిడిపి నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. గ్రామ ప్రధాన రహదారి వెంబడి లోకేష్ పాదయాత్ర సాగుతున్న తరుణంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు కసుకుర్తి శ్రీనివాసరావు కుమారుడు చిన్ను పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఓవైపు సిఎం జగన్, గుడివాడ, గన్నవరం ఎంఎల్‌ఎలు కొడాలి నాని, వంశీ ఫొటోలు, మరోవైపు నారా లోకేష్ ఫొటో పెట్టి స్వాగతం అంటూ, వైసిపి హయాంలో గ్రామంలో జరిగిన అభివద్ధి పనుల వివరాలతో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వైసిపి బ్యానర్‌పై లోకేష్ ఫొటో ముద్రించడాన్ని టిడిపి కార్యకర్తలు వ్యతిరేకించారు. అయితే ఆ ఫ్లెక్సీని తమ సొంత స్థలంలో స్థలంలో ఏర్పాటు చేసుకున్నామంటూ వైసిపి వారు వాగ్వివాదానికి దిగారు. దీంతో టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య తోపులాటలు జరిగి ఘర్షణకు దారితీశాయి. స్థల యజమాని కసుకుర్తి శ్రీనివాసరావు కుమారుడు చిన్ను ఫిర్యాదు మేరకు స్వంత స్థలంలో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీని చించి కుటుంబ సభ్యులపై దాడి చేసి చంపేస్తామని బెదిరించారనే ఆరోపణతో టిడిపి గ్రామ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, మొవ్వా శ్రీనివాసరావు, కనకవల్లి చిన యాకోబు, కొలుసు రంగారావు, వెనిగళ్ల శేఖర్, కొండపల్లి ఏసన్న తదితరులు ఎనిమిది మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే వైసిపి గ్రామ అధ్యక్షుడు తలారి ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కులం పేరుతో దూషించడమే కాక అడ్డువెళ్లిన తనతోపాటు గుర్నాథం అనే వ్యక్తిని కొట్టి తీవ్రంగా గాయపరచినందుకుగాను ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. యువగళం పాదయాత్రను భగ్నం చేసేవిధంగా దాడి చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించారని వీరవల్లి పోలీస్టేషన్లో తాను ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని టిడిపి నేతలు ఆరోపిస్తున్నారు. అదే సమయంలో టిడిపి శ్రేణులు తనపై పోలీస్టేషన్లోనే దాడిచేశారని తలారి వినయరత్నం ఫిర్యాదుతో టిడిపి నేతలు రావి వెంకటేశ్వరరావు, కొల్లు రవీంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులపైనా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి యార్లగడ్డ వెంకట్రావుపై అన్ని కేసుల్లోనూ ప్రధాన నిందితుడిగా చేర్చారు. దీనిపై వీరవల్లి ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ మూడు కేసులు నమోదు చేసి కోర్టుకు తెలియజేశామని, కోర్టు ఉత్తర్వుల ప్రకారం వీడియో ఫుటేజీల ఆధారంగా విచారిస్తామని తెలిపారు.

టిటిడి పాలక మండలి సభ్యుడిగా సామినేని



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలక మండలి సభ్యుడిగా జగ్గయ్యపేట శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను నియమితులయ్యారు. 24 మంది సభ్యులతో టిటిడి పాలక మండలి సభ్యుల జాబితాను శుక్రవారం అధికారికంగా విడుదల చేశారు. ఎంఎల్ఎల కోటాలో ఉదయభానుకు అవకాశం దక్కింది. టిడిపి చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు.

28న గద్దర్ సంస్మరణ సభ

ప్రజాశక్తి - విజయవాడ : కవి, గాయకుడు గద్దర్ సంస్మరణ సభ ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు నగరంలోని బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో జరుగుతుంది. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.బి.సుందర్ అధ్యక్షతన జరిగే ఈ సభలో ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసీం, విశిష్ట అతిథిగా ప్రముఖ విప్లవ గాయని విమలక్క పాల్గొంటారు. అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్, సూరాబత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్ హాజరవుతారు. బెజవాడ బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఎపిసిఎల్ఎ, కాంగ్రెస్, టిడిపి, వైసిపి లీగల్ సెల్స్, ఎపిసిఎల్‌సి, ఐఎపిఎల్ ఆధ్వర్యాన ఈ సభ ఏర్పాటు చేశారు.



సామూహిక దీక్షలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

కృష్ణా డెల్టా దుస్థితికి ప్రభుత్వమే కారణం

- మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్
- పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద సామూహిక సత్యాగ్రహం

ప్రజాశక్తి - అవనిగడ్డ : రైతులు సంఘటితంగా పోరాడకుంటే భవిష్యత్తులో కృష్ణాడెల్టాలో తీవ్ర సాగునీటి సంక్షోభం ఏర్పడుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. దివిసీమ రైతు పోరుబాట కార్యక్రమంలో భాగంగా పులిగడ్డ అక్విడెక్టు వద్ద శుక్రవారం ఆయన సామూహిక సత్యాగ్రహ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణాడెల్టా మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపులేని విధానాల కారణంగానే ఈ పరిస్థితి రాబోతోందన్నారు. 2002-03 సంవత్సరాల్లో మాదిరి పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ప్రాజెక్టులన్నీ నీరులేక వెలవెలబోతున్నాయని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను పూర్తిస్థాయిలో ప్రకాశం బ్యారేజీకి మళ్లించి ఉంటే డెల్టాలో నేడు ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదన్నారు. నాలుగేళ్లపాటు పట్టిసీమ మోటార్ల నిర్వహణను పట్టించుకోలేదన్నారు. దీంతో అవి పూర్తి సామర్థ్యంతో పనిచేయడంలేదన్నారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే మళ్లీ డెల్టా పరిరక్షణకు మరో ఉద్యమం చేయాల్సి వచ్చేలా ఉందన్నారు. మున్నేరు నుండి వచ్చిన వరద నీటిని సముద్రం పాలు చేసి పులిచింతల, ప్రకాశం బ్యారేజీల్లో గరిష్ట సామర్థ్యంతో నిల్వ చేయకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణమన్నారు. 2 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కెవి కెనాల్‌కు కేవలం 1100 క్యూసెక్కులు, 1000 క్యూసెక్కుల సామర్థ్యమున్న దివిసీమ కాల్వలకు కేవలం 550 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోందన్నారు. దీంతో పంట పొలాలకు సాగునీరందక రైతులు రేయింబవళ్లు ఆయిల్ ఇంజన్లు పెట్టుకొని నీళ్లు తోడుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గత నాలుగేళ్ల నుండి నీటిపారుదల రంగానికి నిధులు తీసుకురాలేకపోవడంతో దివి సీమలో సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధి సిగ్గులేకుండా ఫ్లెక్సీలు కట్టించడం, కరపత్రాలు (మిగతా 6లో)

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : కొత్తగూడెం పాల ఉత్పత్తి దారుల సహాయ సహకార సంఘంలో శుక్రవారం 250 మంది పాల రైతు లకు రూ. 2,078,60 లను ధర వ్యత్యాస బోనస్ కింద పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా పుల్లూరు పిఎసిఎస్ అధ్య క్షులు చిలుకూరు రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు అధికంగా పాలు పోసి బోనస్ పొందాలని సూచించారు. మైలవరం క్లస్టర్ మేనేజర్ టి.యశ్వంత్ మాట్లాడుతూ ఉచిత గడ్డికనుపులు, క్షీర బందు, కళ్యాణ్ మస్తు పథకాలను పాల రైతులందరూ పొందాలని సూచించారు. గత ఏప్రిల్ నెల నుండి జూలై వరకు ఎక్కువగా పాలు పోసి అత్యధికంగా పల్లె పోగు నాగేషు 19,985, భీమవరపు ముత్తారెడ్డి 8,876, గరికపాటి మరియదాసు 7,878 బోనస్‌ను అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు అప్పిడి సాంబిరెడ్డి, సూపర్వైజర్లు పాలకవర్గ సభ్యులు వేతన కార్యదర్శి పాల ఉత్పత్తిదారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదీకా అమృత మహోత్సవ్

ప్రజాశక్తి - కంచికచర్ల : దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన త్యాగమూర్తులను స్మరించుకొని వారి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదా దేవి అన్నారు. కంచిక చర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆజాదీ కా అమత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల సిబ్బందితో కలిసి హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల ఆవరణలో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ దేశాన్ని రక్షిస్తాం.. ఈ దేశాన్ని అభివద్ధి చేయడంలో మేమందరం భాగస్వాములవుతాం.' అని మట్టి చేతులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ యు.శ్రీనివాసరావు, యువజన సర్వీసుల శాఖ, పి డి ఉమాదేవి, ఎంపిడిఒ బాలశంకర్ డిప్యూటీ తాహసీల్దార్ నాగులు మీరా జెడ్ పిటిసి వేల్పుల ప్రశాంతి సర్పంచ్ వేల్పుల సునీత విద్యాశాఖ అధికారి బాలాజీ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ఎపిఎం భాస్కరరావు, సచివాలయం సిబ్బంది, ఎఎన్ఎంలు, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, పాల్గొన్నారు.

సిఎం జగన్‌తోనే సుస్థిర పాలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సుస్థిరపాలన ఏర్పడుతుందని తద్వారా భవిష్యత్ తరాలకు భరోసా కలుగు తుందని యువ నాయ కులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొ న్నారు. గురువారం రాత్రి పట్టణంలోని 10వ సచివాల యం పరిధిలో 20, 22 వార్డులలో బాలికల పాఠశాల నుండి జగ్గయ్య పేట నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజననాయకులు సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ భావితరాల భరోసాకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అండగా ఉంటారని అన్నారు. గత పాలనలో బడుగు బలహీన వర్గాలు అట్టడుగు స్థాయిలో ఉండేవారన్నారు. నేడు అటువంటి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, మహిళా విభాగం అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, ఎస్టీ విభాగం అధ్యక్షులు బద్దు నాయక్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, పాల్గొన్నారు.

షిరీన్ బేగంపై షబ్లి వ్యాఖ్యలు దారుణం



మాట్లాడుతున్న ఎన్.వి.రావు, సంఘ సభ్యులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంకితభావం కల్గిన నిజాయితిగా పనిచేసే గ్రూప్-1 అధికారి షిరీన్ బేగంపై స్వలాభం కోసం, స్వప్రయోజనం కోసం అబ ద్ధాలతో అభియోగం చేస్తున్న మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూక్ షిబ్లి వెంటనే క్షమాపణ చెప్పాలని బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.వి. రావు, సంఘ ముస్లిం మహిళలు తెలిపారు. శుక్రవారం చిట్టినగర్ కెఎల్ రావు నగర్‌లో అసోసియేషన్ కార్యాలయంలో బిసి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైనమిక్ అంకితభావం కల్గిన నిజాయితిగా పనిచేసే అధికారి వీరిన్ బేగంపై షిబ్లి నోటికొచ్చినట్లు మాట్లాడితే మర్యాదగా వుండదన్నారు.

'దళిత రక్షణ యాత్ర' జయప్రదం కోరుతూ చర్చాగోష్టి



మాట్లాడుతున్న నటరాజ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచినప్పటికి దళిత సామాజిక, ఆర్థిక, సమస్యలు కేంద్ర, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం చాలా బాధాకరమని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ కార్యదర్శులు కోట కళ్యాణ్, జి. నటరాజ్ దుయ్యబట్టారు. పట్టణంలోని టీచర్స్ కోపరేటివ్ భవన్‌లో శుక్రవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి వెంకటరావు అధ్యక్షతన చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలోనూ ఇప్పుడూ అధికారంలోకి వచ్చిన టిడిపి వైసిపిలు ప్రజలను మోసగిస్తూ వచ్చాయన్నారు. దళత ప్రజల అభివద్ధిని విస్మరించటం వలనే దళిత ప్రజల అబివద్ధి ఎజెండాగా కెవిపిఎస్, ఎఐఎడబ్ల్యుయు సంయుక్తగా, "దళిత రక్షణ యాత్ర" చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిని అన్ని జిల్లాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉభయ రాష్ట్ర కమిటీలు రూపొందించిన చాట్రాఫ్ డిమాండ్లను చర్చించేందుకు చర్చాగోష్టి జరిగిందన్నారు.

ఈ చర్చాగోష్టి నిర్వహణకు గల కారణాలైన అంశాలను హాజరైన సంఘాల నాయకులకు వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోటా కళ్యాణ్ సంఘాల ఆమోదానికి ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల్లో 41 సిఆర్పిసి నోటిసు తీసుకోని దోషులను బెయిల్‌పై బయటకు పంపటాన్ని నిలిపివేయాలని, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలుచేయాలన్నారు. దళితులపై దాడులు జరిగిన సందర్భంలో ప్రభుత్వానికి తెలియజేసేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రకటించాలి. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అలుచేయాలి. దళితులకు 1235 జీవో ప్రకారం 2 ఎకరాల శ్మశాన భూమిని కేటాయించాలి. మౌలిక వసుతులు సమకూర్చాలి. భారత లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. ప్రభుత్వ రంగ పరిశ్రమలు కపాడాలి. ప్రైవేటు రంగంలో కూడ రిజర్వేషన్లు అమలు చేయాలి. సబ్‌ప్లాన్ చట్టానికి కాల పరిమితి తొలగించి, నిధులు దారిమళ్ళించకుండా కట్టుదిటం చేయాలి. దళిత, గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత కరంట్‌ను, ప్రాంతాలతో సంబంధం లేకుండా అమలుచేయాలని మొదలైన డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని సంఘాల నాయుకుల ఆమోదం కొరకు ప్రవేశ పెట్టారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఆదిమళ్ళ అబ్రహాం పోరాట సాధన కమిటీకి కన్వీనర్‌గా, 15 మందితో కమిటీ వేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎ.శివాజీ, కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, ఎస్.రామనాథం, కె.మధు, నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి




కార్పొరేటర్ చర్యల పట్ల నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - భవానీపురం : మహిళపై లైంగిక దాడికి పాల్పడిన కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి, నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 40వ డివిజన్ కార్పొరేటర్ అయిన యరడ్ల ఆంజనేయ రెడ్డి వద్దకు ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇప్పించాలని వచ్చిన అదే సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళ పట్ల వ్యవహరించిన తీరు సభ్య సమజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. ఈ ఘటనపై శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వపాలనలో మహిళలకు రక్షణ లేదా అంటూ సీఎం జగన్‌ను ప్రశ్నించారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ సేవల కోసం వచ్చే మహిళల పట్ల ఇలా ప్రవర్తించేవారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. మహిళపై లైంగికదాడికి పాల్పడ్డ వైసిపి 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డిపై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భవానీపురంలో ఈ సంఘటనపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్. బేగ్ మాట్లాడారు.

ఆస్తి కోసం రెండో వివాహం చేసుకోవాలని చిత్రహింసలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ఆస్తి కాజేయాలనే కుట్రతో రెండో వివాహం చేసుకోవాలని బలవంతం చేస్తున్న మేనమామ శరణం మురళీకష్ణ, వారికి సహకరిస్తున్న వారిపై జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఫిర్యాదు నందనమూడి భావన సాయి తెలిపిన వివరాల ప్రకారం తన తండ్రి నందనమూడి రవి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకోగలిగారని, 2021లో వచ్చిన కరోనాకు గురై మరణించారని తెలిపారు. ఆ తర్వాత తన తండ్రి రవికి చెందిన ఆస్తులు సమాచారం తెలుసుకొని మేనమామ మురళీకష్ణ మా ఆస్తులను కాజేయాలని కుట్రతో తనని బెదిరించి ఇప్పటికే కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తులను, నగలు, నగదును కూడా స్వాహా చేశారని, మిగిలిన ఆస్తులను కూడా తనకే దక్కాలనే ఆశతో గత కొన్ని నెలలుగా తనపై చిత్రహింసలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వరంగల్‌లోని విశ్వవిద్యాలయంలో తన చదువును సాగిస్తున్నప్పటికీ పరీక్షలు కూడా రాయనీకుండా అనేక రకాల చిత్రహింసలకు పాల్పడ్డారని తెలిపారు. మేనమామ శరణం మురళీకష్ణకు తమ తాత శివయ్య, అమ్మమ్మ పద్మావతి, రాజేశ్వరి, తోట రామారావు, ఉమామహేశ్వరులు సహకారం అందించి తనకు తీవ్ర ఇబ్బందులను సృష్టించినట్లు పేర్కొన్నారు. గహంలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసి చంపేందుకు ప్రయత్నించగా పారిపోయి జగ్గయ్యపేటలోని తన బాబాయి మధు ఇంటికి చేరుకొని ప్రాణాలను కాపాడుకోగలిగానని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ బి.వి.రామారావు కేసు నమోదు చేశారు.

ఫిష్ ఆంధ్ర మినీ అవుట్‌లెట్ ధ్వంసం



కరిసే మధు



బడ్డీకొట్టు గచ్చులు పగలకొడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగులకు బతుకు దెరువు కోసం ఫిష్ ఆంధ్ర మినీ అవుట్ లెట్‌ని కేటాయించింది. దీనిలో భాగంగా పట్టణంలో దళితుడైన కరిసే మధు ప్రభుత్వ పథకమైన ఫిష్ ఆంధ్ర మినీ అవుట్ లెట్ కోసం దరఖాస్తు చేసుకొనగా, ప్రభుత్వం నుండి మంజూరైంది. దీని కోసం అద్దె కట్టలేక చిన్న బడ్డీకొట్టును పట్టణంలోని విద్యానగర్ ఆరో లైన్‌లో గల ప్రభుత్వ ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకొన్నాడు. పేటలో ప్రభుత్వ వస్థలాల కబ్జాలకు పాల్పడుతున్న చారుగండ్ల కొండ అనే వ్యక్తి దళితుడునైన తనను కులం పేరుతో దుర్భాషలాడుతున్నాడని అధికారులకు ఫిర్యాదు చేసినా చారుగండ్ల తీరు మారలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని మధు కోరుతున్నారు.

రాం ప్రదీప్‌కు పితృవియోగం



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరుకు చెందిన రచయిత, ఉపాధ్యాయులు, జెవివి జిల్లా నాయకులు ఎం. రాం ప్రదీప్‌కు పితవియోగం కలిగింది. సాయంత్రం ఆయన తండ్రి ఎం.వెంకటేశ్వర రావు (68) తెలంగాణ రాష్ట్రం, ఏరుపా లెం మండలం, గుంటు పల్లి గోపవరంలో తీవ్ర అనారోగ్యంతో తన ఇంటి వద్ద మృతిచెందారు. తిరువూ రుకు చెందిన సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్ర ప్రసాద్, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, చెకుముకి రాష్ట్ర కార్యదర్శి ఎం.హరికష్ణ, జెవివి మండల అధ్యక్ష, కార్యదర్శులు కడిమి పాపారావు, డి.సుదర్శన్, యుటీ ఎఫ్ నాయ కులు మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



శ్మశానవాటిక గోడ దగ్గర తీసిన గొయ్యి

శ్మశానం గోడను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: స్మశాన వాటిక గోడ పక్కన జెసిబితో కందకం తీసిన వారిపై చర్యలు తీసుకొని, తక్షణమే కందకాన్ని పూడ్చాలని దళితులు డి.కమలేశ్ రాజు, తమలపాకుల పుల్లయ్య, గురుమూర్తి దేవయ్య, కూచిపూడి జయరాజు, ఈశ్వరం వెంకటేశ్వర్లు, కూచిపూడి బుజ్జిబాబు, కూచిపూడి ప్రభాకర్ కోరారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గండ్రాయి రోడ్డులో గల దళితుల శ్మశాన వాటిక గోడ పక్కనే జెసిబితో శుక్రవారం గ్రామానికి చెందిన కొందరు పెద్ద కందకం తీయటంపై దళితులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులు ఎవరైనా మతి చెందితే వారిని తీసుకొని వెళ్లటానికి దారి లేక ఈ కందకం పెద్ద అవరోధకంగా మారుతుందని, గోడ పక్కనే ఈ కందకం తీయడం వలన గోడకు మట్టి సపోర్టుగా లేకపోవడం వలన గోడ పడిపోయే ప్రమాదం ఉందని, శ్మశాన వాటికకు మిగిలిన వైపు గోడ నిర్మించాలని ఎన్నోసార్లు ప్రభుత్వాన్ని కోరిన తమ వద్ద నిధులు లేవని చెప్తున్నారని, ప్రస్తుతం ఒకపక్క మాత్రమే శ్మశాన వాటికకు గోడ ఉందని, ఈ గోడ పక్కన కందకం తీయటంతో ఆ గోడ పడిపోయే ప్రమాదం ఉందని అన్నారు. తక్షణమే కందకాన్ని పూడ్చి వేసి, కందకం తీసిన వారిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మధురానగర్ పసుపుతోట వివి నరసరాజు రోడ్డు 31వ డివిజన్‌లో పెరిగిన కరెంట్ ఛార్జీలకు వ్యతిరేకంగా పవన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ నిరసననుద్దేశించి కష్ణమూర్తి మాట్లాడుతూ కరెంటు ఛార్జీలు ఒకపక్క సర్దుబాటు ఛార్జీలు ఒకపక్క అటు మోడీ ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరూ కలిసి ప్రజలపై కరెంటు భారాలు వేశారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు 50 శాతం పెరగటాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఛార్జీలకు నిత్యావసర వస్తు వులు ధరలకు వ్యతిరేకంగా ప్రజలు బయటకు రావాల్సిన అవసరం వచ్చిం దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఎం.పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని చింతలగుంట గ్రామంలో ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్‌లో గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందిన 2వ తరగతి విద్యార్థి లంకా కార్తీక్(7) మృతదేహానికి కె.వి.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, సిఐటియు మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావులు నివాళులర్పించి కుటుంబసభ్యుల్ని ఓదార్చారు. అనంతరం మండల తాసిల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తానా తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ నిర్మాణంలో పక్కన స్కూల్ జరుగుతుంటే ఎటువంటి కనీస సౌకర్యాలు లేని పూరిపాకలో పాఠశాలను నడపడానికి విద్యాశాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి రెండు రోజు కావస్తున్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు ఇంతవరకు కనీసం పరామర్శించలేదని విమర్శించారు. సిపిఎం పార్టీ నాయకులు బివి శ్రీనివాస్ మాట్లాడుతూ నష్టపరిహారం కింద ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం అందించాలని కోరారు. కుమారుడిని పోగొట్టుకున్న తండ్రి వెంకటేశ్వర రావు అవిటివాడు కావడం వల్ల ప్రభుత్వం ఉపాధి కల్పించి సొంత గహం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అధికారులు దీనిపై స్పందించకపోతే జిల్లా కలెక్టర్ దష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి కుటుంబానికి న్యాయం జరిగేలా కషి చేస్తామని చెప్పారు.


విద్యార్థి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



శ్మశాన వాటికకు స్థలం పరిశీలన

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం) : ఉంగుటూరు మండలం లోని నాగవరపాడు గ్రామంలో భూమిని అధికారులు పరిశీలించారు. గ్రామంలో నివసిస్తున్న ముస్లిం కుటుంబాలకు ప్రత్యేకంగా స్మశాన వాటిక లేకపో వటం వల్ల ఇబ్బందులుపడుతున్నారు. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ ఆదేశాల ప్రకారం సదరు గ్రామ పంచాయతీలో గ్రామ శివారులో గల ఎటువంటి ఆక్షేపణలు లేని 10 సెంట్లు భూమి అవసరం కోసం మండల టీం ఆధ్వర్యంలో సేకరించుట కొరకు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జిఎస్ శేషగిరిరావు ,అమీర్ భాష పంచాయతీ విస్తరణ అధికారి గ్రామ రెవెన్యూ అధికారి సర్వేరు గ్రామ సర్పంచి ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



గ్లామర్ టూ వీలర్ ఆవిష్కరణ

హనుమాన్‌జంక్షన్ : రహదారి భద్రతతో పాటు యువతను ఆకట్టుకునేలా అత్యాధునిక ఫీచర్స్ తో గ్లామర్ వాహనాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ప్రముఖ పారిశ్రామికవేత్త, లయన్స్ గవర్నర్ పుట్టగుంట సతీష్ కుమార్ అన్నారు. హనుమాన్ జంక్షన్ ఏలూరు రోడ్ హీరో షోరూం లో గ్లామర్ వాహనాన్ని ఆయన శుక్రవారం ఉదయం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం ను బెలూన్లులతో అలంకరించారు. మొదటి కొనుగోలుదారు కుసునూరి నాగయ్యకు బైక్ తాళం అందజేశారు. సాయి కళ్యాణి షోరూం అధినేత మూల్పూరి సురేంద్ర కుమార్, షోరూం మేనేజర్ యజ్జవరపు ఆనంద్, వడ్లపట్ల జయరామయ్య,మాలిన కష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యవార్ల దేవస్థానంలో వైభవోపేతంగా శ్రావణ శుక్రవారం వేడుక జరిగింది. శ్రావణమాసం రెండో శుక్రవారం పవిత్ర వరలక్ష్మీ వ్రతం పురస్కరిం చుకుని దేవస్థానంలో ఉదయం నుంచి ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకట్రావు, కొమ్మరాజు సుధీర్ లు అమ్మవారికి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గన్నవరం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి సారెను సమర్పించి తమ మొక్కులు చెల్లించారు.

కొడాలి నానికి ఓటమి భయం పట్టుకుంది : రావి


మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు


ప్రజాశక్తి-గుడివాడ : యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందనకు ఎమ్మెల్యే కొడాలి నానికి పిచ్చిపట్టి బూతులు మాట్లాడుతున్నాడని, లోకేష్‌ను విమర్శిండం చూస్తుంటే నానికి ఓటమి భయ్యం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ ఎదుటవారిని ఇష్టానుషారంగా మాట్లాడే నాని అయనను ఎవరైనా విమర్శిస్తే తాట్టుకోలేడన్నారు. గన్నవరం సభలో తామ నాయకుడు లోకేష్.. కొడాలి నాని నీ బూతులు, అడవాళ్లను నీవు కించపర్చడం చూసి ఎదో ఒకరోజున నీకు అదే గతి పడుతుందని, నిన్ను గుడ్డలు తీసి డ్రాయిర్‌పె నిలబెడతారని విమర్శించారన్నారు. ఆ మాటకే కొడాలికి పిచ్చిపట్టి బూతులు తిడుతూ ఎమ్మెల్యే అనే సంగతి కూడ మరిచిపోయి మాట్లాడడం చూస్తుంటే, ఇతగాడు ఎంత వరకు చదివాడో తెలుస్తుందన్నారు. గుడివాడ గుర్చి పట్టించుకోని కొడాలి, దేశ, రాష్ట్ర రాజకీయలు గురించి మాత్రం సోలు కబుర్లు చెప్పడంలో దిట్టా అని అన్నారు. ప్రజలు నీ పకోడి, సోల్లు మాటాలు నమ్మి ప్రసకే లేదన్నారు. నీకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు.

29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం ఆమనగడ్డలోని డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి జి మారుతి తెలిపారు. శుక్రవారం అవనిగడ్డ సబ్జను పరిధిలోని ఏడు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ కేరళ దినోత్సవం అని పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తేడా మైదానంలో సబ్జాను పరిధిలో శనివారం అండర్ పదిహేడు సంవత్సరాల బాలురకు కబడి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు అదేవిధంగా 28వ తేదీ అండర్ 17 బాలికలకు కబడి అథ్లెటిక్స్ అండర్ 14 బాల బాలికలకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 29న రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా వంద అడుగుల జాతీయ పతాకం ఎగరవేయడం జరుగుతుందని, క్రీడా స్ఫూర్తిని రగిలించేందుకు క్రీడాజ్యోతి ర్యాలీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ లోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ఉద్యోగ ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు అందరూ పాల్గొని తేడాస్ఫూర్తిని తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమం అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కే పూర్ణచంద్రరావు, ట్రెజరర్ ఎం ఉదయ్, ఏడు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమవేశంలో మాట్లాడుతున్న మారుతి

'కళ్యాణమస్తు' కానుక అందజేత


బంగారునాణెం అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్ : కష్ణామిల్క్ యూనియన్‌కు కష్టపడి పాలుపోస్తున్న రైతు కుటుంబాలకు కల్యాణమస్తు కానుక అందజేయటం ఎంతో ఆనందంగా ఉందని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. జంగం గూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం నందు పాలు పోస్తున్న శ్రీమతి తాతినేని శారద కుమార్తె పుష్ప వివాహం సందర్భంగా కల్మాణమస్తు పథకం కింద 20 వేల విలువచేసే బంగారునాణెంను కానుకగా చలసాని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కిలారి కిరణ్ కుమార్, సంఘ అధ్యక్షులు దోనవల్లి వెంకట సుబ్బా రావు, సంఘ కార్యదర్శి రామస్వామి, సంఘ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతలు అయ్యన్న, బుద్ధాపై మరో కేసు

- ఎమ్మెల్యే పేర్ని నాని ఫిర్యాదు

ప్రజాశక్తి-గన్నవరం : యువగళం గన్నవరం బహిరంగ సభ ప్రసంగాలకు సంబంధించి తెలుగుదేశం నేతలపై ఆత్కూరు పోలీస్ స్టేషన్లో శుక్రవారం కేసులు నమోదు చేశారు. సీఐ నరసింహమూర్తి కథనం ప్రకారం మాజీమంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని ఫిర్యాదు మేరకు అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్నలపై విడి విడిగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రంగులరాణి రోజా మేకప్ చూస్తే రాత్రులు కూడా భయమేస్తుందంటూ అంటూ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపైన, అదేవిధంగా ముఖ్యమంత్రి ని ఆర్థిక ఉగ్రవాది, సైకో, ధన పిశాచి, పనికిమాలినవాడు అంటూ చేసిన విమర్శలను తప్పుగా చూపిస్తూ అయ్యన్నపై కేసు నమోదు చేసినట్టు వివరించారు. బుద్దా వెంకన్నపై కూడా కేసు కట్టామన్నారు. ఆత్కూరు ఎస్సై సత్య శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గిడుగు పురాష్కరాన్ని అందజేస్తున్న దృశ్యం

వ్యవహారిక భాషా పితామహుడు 'గిడుగు'

ప్రజాశక్తి-గుడివాడ : వ్యవహారిక భాషకు గిడుగు రామమూర్తి వేసిన పునాది దినదిన ప్రవర్ధమునమై ప్రజా బహల్యంలో చేరి వ్యవహారిక భాష విలువ మరింత పెరిగిందని జిల్లా పశు వైద్యశాఖధికారి డాక్టర్ ఎం.ఎస్.ఎ దివాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గంథ్రాలయంలో తెలుగు భాషా వికాస సమితి సమన్వయ కర్త డిఆర్‌బి ప్రసాద్ అధ్వర్యంలో గిడుగు జయంతి వారోత్సవాల్లో భాగంగా భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖరచయిత్రి యలమర్తి అనురాధకు 2023 గిడుగు సాహితీ పురస్కారాని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా వికాస సమితి సభ్యులు మోకా మాధవరావు, గాదే మోహనబాబు, కొత్త మురళీకృష్ణ, బొగ్గవరపు తిరపతయ్య, చింతలూరి సత్యనారాయణ, నరహరశెట్టి ప్రసాద్, గుళ్ళపల్లి కిరణ్‌బాబు, కె.సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : సంపాదించిన దాంట్లో కొంత సమాజ సేవకు ఖర్చు చేయడం ద్వారా మనిషి జీవితానికి సార్ధకత చేకూరుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త కాకర్ల శంకరరావు అన్నారు. శుక్రవారం గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని హేమ దుర్గ జ్యాయల్ కౌంటీ గ్రేటెడ్ కమ్యూనిటీ భవన సముదాయంలో జిఅండ్‌జె లక్ష్మీ హెూమ్స్ సౌజన్యంతో చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం వైద్యం చాలా ఖరీదైన వస్తువుగా మారిందని, ఆధునిక వైద్యం అందరికీ అందుబాటులో లేదని అన్నారు. మనిషి సంపాదించిన దాంట్లో ఎక్కువ భాగం వైద్యానికి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందువల్ల ప్రభుత్వాలు ప్రైవేట్ ఆసుపత్రిలో సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించి ఆధునిక వైద్యాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, ప్రముఖ వైద్యులు (డాక్టర్) పద్మ సుందరి, డాక్టర్ వశిష్ట పాల్గొన్నారు. పెద్దలు గుత్తా శ్రీనివాసరావు, జాలది శ్రీనివాస్, ఆర్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం సమావేశం


మాట్లాడుతున్న సయ్యద్ బాజీ

ప్రజాశక్తి - భవానీపురం : రాజకీయంగా తమను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కుమ్మరిపాలెం షదీఖానాలో నూర్‌భాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికి నూర్ బాషా ముస్లీం సంక్షేమ సంఘాన్ని పునర్నిర్మించారు. తిరిగి రాష్ట్ర అధ్యక్షులుగా మరోసారి ఏలూరు జిల్లాకు చెందిన షేక్ సయ్యద్ బాజీ (ఎస్ఎస్ బాజీ) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టంగుటూరు గౌసియా, రాష్ట్ర యూత్ అధ్యక్షులు మట్టిపాటి భాష, రాష్ట్ర ఉద్యోగ అధ్యక్షులుగా షేక్ మౌసిని, రాష్ట్రం లీగల్ అడ్వైజర్‌గా ఆకుముల పెద్ద కాశయ్యని, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జిగా దూదేకుల హుస్సేన్‌ని, ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కొక్కరిని రాష్ట్ర కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కమిటీ అధ్యక్షులు అలాగే 21 జిల్లా యూత్ అధ్యక్షులు 15 జిల్లాల సోషల్ మీడియా అధ్యక్షులు నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో దూదేకుల ముస్లీం సంక్షేమ కోసం కృషిచేస్తామన్నారు. అలాగే త్వరలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాష్ట్ర స్థాయి పర్యటన ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కూడా నామినేటెడ్ స్థాయి పదవుల్లో మమ్మల్ని గుర్తించి నూర్ భాషాలకు సముచిత స్థానం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ మీరా (పల్నాడు జిల్లా), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హుస్సేన్ (పశ్చిమగోదావరి జిల్లా), తదితరులు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్

టైలరింగ్ కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పలు కేంద్రాల్లో నిర్వహించనున్న టైలరింగ్ కేంద్రాలను వినియోగించుకొని మహిళలు టైలరింగ్ వృత్తిలో రాణించి, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. 39వ డివిజన్‌లోని 117వ సచివాలయంలో టైలరింగ్ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవతో కలిసి నగరమేయర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయంశక్తి సాధించాలనే లక్ష్యంతో నగర వ్యాప్తంగా 19 టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క కేంద్రంలో 12 కుట్టుమిషన్లు ఏర్పాటు చేసి, బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఆరు మాసాల పాటు టైలరింగ్‌ను నేర్పించి, సర్టిఫికెట్స్ ఇప్పించడం జరుగుతుందన్నారు. టైలరింగ్ నేర్పిన టీచర్ ఒక్కొక్కరికి నెలకు రూ. పది వేలు చొప్పున వేతనం వస్తుందన్నారు. ఈ అకాశాన్ని ప్రతి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పిఒ యుసిడి కె శకుంతల, సిడిఒ-1, టెక్నికల్ ఎక్స్‌ఫర్ట్ ఎంఇ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేయు ప్రాంతాలు

ప్రజాశక్తి - భవానీపురం : భవానిపురం పరిధిలోని 11 కె.వి. టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా క్రింద తెలియపరచిన ప్రాంతములలో ఈనెల 26వ తేదీ శనివారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు (2గంటలు) విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియ దర్శిని కాలనీ వరకు విద్యుత్ నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగ దారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వాస్పత్రికి పరుపులు అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ శుక్రవారం ఉదయం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశుసంక్షేమ వార్డుకు సుమారు 70 వేల రూపాయల విలువచేసే 25 పరుపులను అడ్మిన్ రోషనారా సమక్షంలో ఉచితంగా అందచేసింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్ కుమార్, ఫౌండేషన్ అధ్యక్షులు కోనేరు వెంకట రామారావు, ఉపాధ్యక్షులు మేరుగ అక్కయ్య నాయుడు, ఆస్పత్రి అధికారులు పాల్గొన్నారు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పోతిన నాగమణి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ పోతిన వరప్రకాష్ తన మాతృమూర్తి పోతిన నాగమణి 31వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆమెకు పూజా కార్యక్రమాలు నిర్వహించి మహిళలకు చీరలను పంపిణీచేశారు. పేద పిల్లలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీనన్న దళం కార్యాలయంలో కూడా ఆమె చిత్రపటానికి పూజలు జరిపించి అక్కడ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనన్న దళం సభ్యులు తణుకు శంకర్రావు నాయుడు, సూరాబత్తుల రాంబాబు, నక్క బాలాజీ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న దృశ్యం

బి.పి. మండల్ జయంతి

ప్రజాశక్తి - భవానీపురం : ఎపి పి.టి.డి (ఆర్టీసీ) బిసి ఎంప్లా యీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌పి శేషగిరిరావు ఆధ్వర్యంలో బిసి రిజర్వేషన్లకు ఆధ్యులు, మండల్ కమిషన్ చైర్మన్‌గా, కేంద్ర రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సర్వీసులో 27 శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుభావులు బి.పి.మండల్ (బిందెశ్వర ప్రసాద్ మండల్) జయంతి కార్యక్రమం శుక్రవారం భవానీపురంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని జాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ సంఘం కార్యదర్శి మాదల. తిరుపతిరావు, ఏపీ చాత్తాద శ్రీ వైష్ణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌పి.యశోద, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ : బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల్ జయంతి కార్యక్రమంలో అధ్యక్షులు కె.బి.సుందర్ ఉపాధ్యక్షులు పుప్పాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, లైబ్రేరియన్ సెక్రటరి ఆకుల పాండురంగ విఠల్, కోశాధికారి బత్తుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి కన్నెగంటి జయలక్ష్మి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

డెంగ్యూ కేసులు పెరుగుతున్నా పట్టించుకోరా : సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని కాకాని నగర్‌లో శుక్రవారం పున్నవెల్లి గ్రామంలో డెంగ్యూ కేసులు విస్తరిస్తున్న తరుణంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వారి కార్యాలయంలో ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డెంగ్యూ జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని, నది ఒడ్డున ఉన్న కనీసం తాగునీరు కూడా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 25పైగా కేసులు, ఒకే కుటుంబంలో ఆరుగురు డెంగ్యూ జ్వరాలతో బాధపడుతుంటే కనీస వైద్య సదుపాయాలు కూడా అందించలేని పాలకుల చేతకానితనం నిజంగా శోచనీయం అని పేర్కొన్నారు.

పంటనష్టపరిహారం ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - వత్సవాయి : రైతు దగ్గర నుంచి పంట నష్ట పరిహారం ఇప్పించాలని కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం అందించిన నష్టపరిహారాన్ని రైతు దగ్గర నుంచి ఇప్పించాలని సింగవరం గ్రామానికి చెందిన కౌలు రైతులు విన్నవించుకుంటున్నారు. మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన కౌలు రైతులు సింధు రాజా మరియు సింధు ప్రతాప్ తండ్రి శివాజీ పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన రైతు లగడపాటి రామారావు తండ్రి పుల్లయ్య దగ్గర లింగగూడెం రెవెన్యూ పరిధిలో ఆర్ఎస్ నెంబర్ 1 బై 45 లో 11 ఎకరాల 58 సెంట్లు మరియు సర్వే నంబర్ 47లో ఒక ఎకరం 80 సెంట్లు భూమిని మొత్తం 13 ఎకరాల 38 సెంట్లు రైతు దగ్గర నుంచి పొలం సాగు చేశామని తెలిపారు. 2021 -22 సంవత్సరంలో మిర్చి పంట సాగు చేశామని తెలిపారు. కౌలు గుర్తింపు కార్డుకు దరఖాస్తు పెట్టుకోగా రైతు దగ్గర ఉన్న పాస్బుక్ జిరాక్స్ ఇవ్వాలని అధికారులు తెలపడంతో ఆ రైతు పాసుబుక్కు జిరాక్స్ ఇవ్వకుండా తిప్పుతూ కాలయాపన చేశారని ఆరు తెలిపారు.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ: ఉర్దూ భాష అభివద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కషి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి ఎస్‌బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఎమ్.డి.రూహుల్లా నేతత్వంలో, రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) ఆధ్వర్యంలో విజయవాడ, గురునానక్ కాలనీలోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రూట నాయకులు కలిశారు.' ఉర్దూ, ఇంగ్లీష్ మిర్రర్ ఇమేజ్ పుస్తకాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా సిఎస్ఇ వెబ్సైట్‌లో పొందుపరచాలని, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సిఇడిఎం (సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్) ద్వారా సరఫరా చేయాలని కోరుతూ మంత్రికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే మైనారిటీ శాఖ వారితో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యను పరిష్కరించారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో ఉర్దూ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జుజ్జూరులో ప్రభుత్వ మండల కార్యాలయాలు ప్రారంభం



నూతన కార్యాలయం

ప్రజాశక్తి - నందిగామ : వీర్లపాడు మండలంలో జుజ్జూరు గ్రామంలో ఎండిఒ, ఎమ్మార్వో కార్యాలయాలను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం ప్రజల ఆకాంక్షల మేరకే వీరులపాడు నుండి జుజ్జూరు ను మండల కేంద్రంగా మార్చాం అన్నారు. 2, 3 నెలల్లోనే జుజ్జూరులో పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలను ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. వీరులపాడు మండల అభివద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జుజ్జూరు మండల కేంద్ర మార్పు విషయంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ గోడ మీద పిల్లి వాటం ప్రదర్శించిందన్నారు. ఈ విషయంలో కూడా రాజకీయ లబ్ధి కోసమే తెలుగుదేశం పార్టీ తాపత్రేయపడుతుందని విమర్శించారు. ప్రజా నాయకుడైన వట్టికొండ చంద్రమోహన్ గత ఎన్నికల్లో తమకు అండగా నిలిచారని, ప్రజల ఆకాంక్షల మేరకు జుజ్జూరు మండల కేంద్రం మార్పునకు ఆయన సహకరించాలని కోరారు. జుజ్జూరు గ్రామంలో రానున్న రోజుల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజ్, 20 పడకల ఆసుపత్రి లాంటివి ఏర్పాటు చేసి.. జుజ్జూరును పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్ రెడ్డి సహకారంతో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నా మన్నారు. అనంతరం ఎమ్మెల్సీని అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సీపీఎం నాయకులు ,సమస్యల వినతి పత్రాన్ని సమర్పించారు.


భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం


వన్‌టౌన్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి - కంచికచర్ల : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శుక్రవారం కంచికచర్ల మండలంలో పలు దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు ఇళ్ళల్లో దేవతా విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. స్థానిక మహాలక్ష్మి దేవాలయంలో దేవతా విగ్రహాన్ని అష్టలక్ష్మిగా అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి దేవాలయం, శివాలయం, వినాయకుని గుడితో పాటు మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ళల్లో పగటి పూట ఉపవాస దీక్ష చేసి, దేవతా విగ్రహాలు అలంకరించి కుంకుమ పూజ చేశారు. దీంతో ఆలయాలు కిటకిటలాడాయి.

వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రావణ (రెండవ) శుక్రవారం, "శ్రీ వరలక్ష్మి దేవి" అలంకారంలో దుర్గమ్మ భక్తులక దర్శనమిచ్చింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ వర్ణముల పూలతో సుందరంగా అలంకరింపబడిన శ్రీ అమ్మవారి ఆలయం అమ్మవారి దర్శనార్ధం విశేషంగా విచ్చేసిన భక్తుల రద్దీ దష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ అధికారులు ఉదయం నుండి విశేషంగా విచ్చేసి, శ్రీ వరలక్ష్మి దేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గ అమ్మవారిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చన సేవల యందు భక్తులు పూజల్లో పాల్గొన్నారు. నిత్య ఆర్జిత సేవలైన శ్రీ అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్షకుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతికళ్యాణం మరియు ఇతర సేవల యందు విశేషముగా పాల్గొని, శ్రీ అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు.

నందిగామ : నందిగామ పట్టణంలో శ్రీపురంలో వేంచేసి ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి శ్రావణమాస వరలక్ష్మి వ్రత విశేష సందర్భంగా రెండవ శ్రావణ శుక్రవారం అమ్మవారికి పంచామతాలతో, వివిధ ఫల రసాలతో అభిషేకం, లలితసహస్రనామ కుంకుమార్చన పూజ, నీరాజన మంత్రపుష్పములు ఆలయ అర్చకులుచే పూజ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, కార్యదర్శి వనమా బుల్లబ్బాయి, ట్రెజరరీ ఊటుకూరి సత్యనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, చవట నాగేశ్వరరావు, చలపాటి పార్థ తదితరులు పాల్గొన్నారు.


కంచికచర్ల మహాలక్ష్మి దేవాలయంలో ప్రత్యేక అలంకరణ


నందిగామలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

అసలే డిమాండ్..ఆపై నిర్లక్ష్యం

- వృథాగా పోతున్న మంచినీరు



ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : జిల్లా మండల కేంద్రమైన మచిలీపట్నంలో ఒకపక్క రెండు రోజులకు ఒకసారి ఇళ్లకు మంచినీటి సరఫరాతో ప్రజలు అవస్థలు పడుతుంటే మరోపక్క మంచి నీటి పైపు లైనులు లీకులతో నీరు వథా కావడం పట్ల పలువురు నగర వాసులు తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. నీటిని పొదుపుగా వాడుకోండి, ముందు తరాల వారికి ఆదర్శంగా నిలబడండి అనే అధికారులు, నాయకులు వథాగా పోతున్న నీటిపై చర్యలు తీసుకోవట్లేదు. కాలేఖాన్ పేట, పరాసుపేట, కలెక్టరేట్ సమీపం, శారదా నగర్ శివారు వద్దే రంగారావు కాలనీ, స్థానికంగా పలు ప్రాంతాలలో కొన్ని నెలలుగా ఈ పరిస్థితి నెలకొని ఉన్నా ఎవరు ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో ప్రజలు ఆగ్రహావేశాలు వెలిబుచ్చుతున్నారు. నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించండి అని పలువురు అధికారులు, నాయకులకు తెలపడం వంటివి జరుగుతున్నాయి. రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్ళు ఇవ్వగలం అంటూ ఖరాఖండిగా నాయకులు చెబుతున్నారని, వధా అవుతున్న నీటిపై మాత్ర ఎటువంటి చర్యలు చేపట్టక పోవడంతో నగర వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి డివిజన్ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చిన లీకేజీల గురించి పట్టించుకోక పోవడం, మున్సిపల్ కమిషనర్ తనిఖీలు లేకపోవడంతో నగరంలో అనేక చోట్ల మంచినీటి పైపులు లీకేజీలతో నీరు వధాగా పోతున్నాయి. ఇదిలా ఉంటే ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో ట్రాక్టర్లతో మంచినీరు సరఫరా చేసే పరిస్థితి ఇప్పటికీ నెలకొని ఉంది. ట్రాక్టర్లతో సరఫరా అవుతున్న మంచి నీటిని సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారు. కొన్ని వ్యాపార సంస్థలకు సరఫరా చేస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

రూ 53.25 కోట్లతో ప్రతిపాదనలు

అమృత్ 2.0 పథకం అమల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మచిలీపట్నం నగరపాలక సంస్థ నుంచి వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు పంపించగా, ఇటీవల కేంద్రం నిధులు కూడా విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి కూడా స్పష్టం చేశారు. నగరంలో నెలకొన్న ప్రధాన సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేలా అధికారులు రూ 53.25 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. వీటిలో అత్యధికంగా రూ 36 కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మించాలని నిర్ణయించారు. దీంతో పాటు రూ 13 కోట్లు తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి అవసరమని చెప్పారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికీ పైపులైన్లు లేకపోవడం, కొన్నిచోట్ల ఉన్నా పాడైపోవడంతో తరచూ లీకులు ఏర్పడి తాగునీరు వథాగా పోతుంది. ఇప్పటికే అమృత్ ఫేజ్-1లో రూ 33 కోట్లతో నిధులు మంజూరైనట్లు తాగునీటి వసతి కల్పించేందుకు పనులు చేపట్టారు. అనుసంధానంగా పలు చోట్ల పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఇంకా 56 కిలోమీటర్ల మేర వేయాల్సి ఉన్నట్లు గుర్తించి దానికి అనుగుణంగా ప్రతిపాదనలు చేశారు.

రూ. 43కోట్లు మంజూరు

ఇలా నగరపాలక సంస్థ రూ 53 కోట్లకు ప్రతిపాదనలు చేస్తే రూ 43 కోట్లు మంజూరైనట్లు ఎంపీ బాలశౌరి ప్రకటించారు. అమృత్ ఫేజ్-1లో రూ 33కోట్లు, ఫేజ్-2లో రూ 59 కోట్లు మంజూరు చేయగా వాటితో చేట్టిన పనుల్లో చాలావరకు పూర్తి కాలేదు. ఫేజ్-1 పనులు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం చేపడితే ఫేజ్-2 వి ప్రజారోగ్యం విభాగం ఆధ్వర్యంలో చేపట్టారు. ప్రస్తుతం అమృత్ 2.0 పథకానికి చేసిన ప్రతిపాదనల్లో అన్ని పనులూ అవసరమైనవే. నగరం విస్తరిస్తున్న తరుణంలో ఆశించిన స్థాయిలో వసతులు కల్పించక పోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ నిధులతో ఏపనులు చేస్తారో, ఏవి ఆపేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నాయి. కాగా తాగు నీటి వథాను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దినిపై ఏ ఒక్క అధికారి స్పందించటంలేదు. ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైన్లు మరమత్తులు చేసి తాగునీరు ప్రతి రోజూ ఇళ్ళకు సరఫరా చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కలెక్టర్, కమిషనర్, తహసీల్దార్లకు న్యాయ సేవాధికార సంస్థ నోటీసులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణంపై అధికారులను వివరణ కోరుతూ కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మచిలీపట్నం వారు కష్ణాజిల్లా కలెక్టర్ తదితర అధికారులకు వచ్చేనెల 22వ తేదీన హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు ప్రముఖ న్యాయవాది, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ అధ్యక్షుడు, సోడిశెట్టి బాలాజీ, న్యాయవాదులు, పుప్పాల ప్రసాద్, మాదివాడ వెంకట నరసింహారావు, పి.వి. ఫణికుమార్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ 25 వ తేదీన స్థలం కేటాయించింది. అయిన పనులు ప్రారంభించడం లేదనిక్షా జిల్లా కలెక్టర్ కు స్పందన కార్యక్రమంలో పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన సరియైన రీతిలో అధికారుల నుండి స్పందన లేకపోవడంతో కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మచిలీపట్నం వారి నందు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య మెమోరియల్ బిల్డింగ్ సాధన కమిటీ సెక్రెటరీ పి వి ఫణి కుమార్, కష్ణాజిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మచిలీపట్నం వారి నందు పిటిషన్ దాఖలు చేశారు. దీంతో అధికారులను వచ్చేనెల 22వ తేదీన కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ మచిలీపట్నం వారి నందు హాజరై వివరణ ఇవ్వాలని తెలిపారు.

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'తోట'



ప్రజాశక్తి-గన్నవరం : వైఎస్ఆర్పిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీనియర్ నాయకులు తోట వెంకయ్య నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన ఉన్నారు. పార్టీ అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కషి చేస్తున్నారు. గతంలో కూడా ఈయన జిల్లా కమిటీలో పనిచేశారు. మరోసారి తనకు అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తో పాటు పార్టీ జిల్లా ఇన్చార్జి మంత్రికి, ఈ నియామకానికి కషిచేసిన ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలనుసక్రమంగా నిర్వహించడం ద్వారా పార్టీ అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా పాటు పడతానని వెంకయ్య చెప్పారు. వచ్చే ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మళ్లీ వైసీపీ ప్రభుత్వం రావడం ఖాయమని, వైసీపీ జెండాపై గన్నవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే వంశీ డంకా భజాయించి గెలుపొందడం జరుగుతుందని చెప్పారు. ఎందుకంటే నియోజకవర్గ ప్రజలు అండదండలు అభిమానం వంశీకే ఉన్నాయని వివరించారు.

వన్ టైమ్ ఆపర్చునిటీ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : బి. ఏ, బి. ఎస్. సీ, బి. కామ్‌లలో 2015-2016, 2016-17, 2017-18 విద్యా సంవత్సరాలలో జాయిన్ అయిన విద్యార్థులకు ఒన్ టైమ్ ఆపర్చునిటీ కింద ఎగ్జామ్స్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనికి గాను ఆగస్టు 24 నుంచి సంబంధిత ఆన్లైన్ అప్లికేషన్ పూర్తి చేసి ఫీజు చెల్లించాలని, ఎటువంటి లేట్ ఫీజు లేకుండా ఆగస్టు 31 వరకు అప్లై చేస్కోవచ్చుననికంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్ తెలిపారు. 5000 రూపాయల లేట్ ఫీజు తో సెప్టెంబర్ 06 వరకు అప్లై చేస్కోవచ్చునని తెలిపారు.

107, 108 జీవోలను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : వైద్య విద్యా వ్యాపారానికి ద్వారాలు తెరుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 107, 108 జీ వో లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఎస్ ఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం కష్ణా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల భర్తీలో విద్యా వ్యాపారానికి తెర లేపి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. నాడు జగన్మోహన్ రెడ్డి నా ఎస్సీ, ఎస్టీ ,బీసీ , మైనారిటీలు అని చెప్పుకుని, వాళ్ల ఓట్లతో అధికారంలోకి వచ్చి నేడు ఆ వర్గాల వారికి ద్రోహం చేస్తున్నరన్నారు. మూడు కేటగిరిలుగా సీట్లను భర్తీ చేసి వాటిలో 50 శాతం సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్ఆర్ కేటగిరీలకు కేటాయించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. 25 శాతం మాత్రమే రిజర్వేషన్ సీట్లను కేటాయించడం సరికాదన్నారు. మచిలీపట్నంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బి కేటగిరి 402 , సీ కేటగిరి 160 సీట్లు కల్పిస్తున్నారు కానీ ఎస్సీ ,ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు 443 మార్కులు సాధించిన అవకాశం కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సుధీర్, అయ్యప్ప, జగదీష్ , ఆర్.సాయి,రంజిత్ , కే. సాయి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పమిడిముక్కల: పాఠశాలలోని విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసి రక్తహీనత రాకుండా మందులు అందజేస్తుమని వీరంకులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల అన్నారు.ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె పమిడిముక్కల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పమిడిముక్కల మండలంలోని లంకపల్లి, చోరగుడి, కృష్ణాపురం, అమీనాపురం ఆరోగ్య ఉప కేంద్రాల ద్వారా ఆరోగ్య కార్యకర్తలు ఎప్పటికప్పుడు పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏదైనా రోగం వస్తే డాక్టర్లను సంప్రదించాలని అన్నారు. ఎవ్వరూ మూఢనమ్మకాల జోలికి వెళ్ళవద్దని వైద్య సేవలు అందరూ చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మీ, ప్రియాంక, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బస్‌స్టాప్ వద్ద అడ్డంగా వాహనాల పార్కింగ్

- ప్రయాణీకుల ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక మసీదు సెంటర్లో పామర్రు, మచిలీపట్నం బస్ స్టాప్ వద్ద అడ్డంగా నిలుపుతున 2 వాహనాల వల్ల ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్నారు. విజయ వాడ నుండి పామర్రు, మచిలీపట్నం, అవనిగడ్డ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు మసీదు సెంటర్లో ఎక్కేందుకు ఎప్పటినుండో బస్ స్టాప్ ఉంది. ఈనేపథ్యంలో బస్టాప్ వద్ద ఉన్న షాపులు, ప్రైవేట్ బ్యాంక్కు వెళ్లేవారు అడ్డంగా ద్విచక్రవాహనాలు, కార్లు నిలపడంతో స్టాప్‌లో బస్సుల కోసం వేచి ఉండేవారు బస్సుఎక్కేందుకు వీలులేక పోవడంతో ఇబ్బందులుపడుతున్నారు. అదేవిధంగా బస్ స్టాప్ వద్ద నిలిపేందుకు ఖాళీ లేకపోవడంతో బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్న నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ పోలీసులు పట్టించుకుని బస్ స్టాప్లో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మసీదు సెంటర్లో బస్ స్టాప్ వద్ద అడ్డంగా నిలిపిన వాహనాలు

ఉత్సాహంగా ప్రభల ఉత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : రెండవ శుక్రవారం సందర్భంగా గన్నవరంలో అత్యంత ఉత్సాహంగా జరిగింది. తీన్మార్ డబ్బులు, డిజె సౌండ్ లు, యువకుల డాన్సులతో గన్నవరం మార్మోగింది. ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ చిట్టినేని రామకోటేశ్వరరావు జ్ఞాప కార్థం వారి కుమారుడు చిట్టినేని వెంకట్రావు ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా సంప్రదాయబద్ధంగా నిర్వ హిస్తున్న ప్రబల ఉత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎద్ల బండి పై ప్రభను పెట్టుకుని గ్రామంలో ఊరేగారు. అదేవిధంగా గౌడ పేట, యాదవుల పేట, కొత్తపేట ఏరియా నుంచి అలంకరించిన ప్రభలతో పట్టణంలో పెద్ద ఎత్తున ఊరేగింపులు జరిపారు. ఈ ప్రబల ఊరేగింపు రాత్రి 7 గంటలకు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ నుంచి తిరిగి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ఇళ్లకు చేరుకున్నాయి. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.



చిట్టినేని రామకోటేశ్వరరావు జ్ఞాపకార్థం కట్టిన ప్రభ

పలువురు నాయకులు టిడిపిలో చేరిక

హనుమాన్‌జంక్షన్ : : బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచుతూ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికస్వావలంబనకు అనేక పథకాలను అమలు చేసింది టీడీపీయేఅని రాచప్రోలు ఆశోక్ కుమార్ అన్నారు. యువగళం పాదయాత్ర జరుగుతున్న సమయంలో గురువారం మాజీ ఎంపీటీసీ బేతాళ ప్రమీల రాణితో కలిసి సాయంత్రం నారా లోకేష్ సమక్షంలో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలేరుకు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

చంద్రబాబును కలిసిన మాగంటి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్, పరిటాల శివారు నక్కలంపేటకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు మాగంటి వెంకట రామారావు (అబ్బాయి) శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. తొలినుంచి కాంగ్రెస్ వాదిగా ఉన్న ఆయన మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు, మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్‌కు ముఖ్య అనుచరుడు. 2009-14లో కంచికచర్ల మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. 2014కు ముందు రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ నుండి వైసిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో మైలవరం, నందిగామ ఎంఎల్‌ఎలు వసంత కష్ణ ప్రసాద్, డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు గెలుపునకు కషి చేశారు. మైలవరం ఎంఎల్ఎతో సన్నిహితంగా మెలిగారు. కంచికచర్ల మండల రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించి నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందారు. 2019లో నందిగామ ఎంఎల్‌ఎగా డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు గెలిచిన తర్వాత మొండితోక సోదరులతో విబేధాలు తలెత్తాయి. దీంతో నాలుగేళ్లుగా ఆయన వారికి దూరంగా ఉంటున్నారు. వైసిపి నాయకత్వంతో ఇమడలేక ఇటీవల తన అనుచరుల సూచన మేరకు వైసిపికి రాజీనామా చేశారు. దీంతో టిడిపి నేతలు ఆయనతో మంతనాలు జరిపారు. ఈ నేపథ్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను యువగళం పాదయాత్రలో కలిసి సంఘీభావం తెలిపారు. అంతేగాక ఉండవల్లిలో మాజీ సిఎం చంద్రబాబును శుక్రవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనను చంద్రబాబు టిడిపిలోకి ఆహ్వానించినట్లు మాగంటి అబ్బాయి తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే నందిగామలో టిడిపి అభ్యర్థి గెలుపునకు కషి చేయాలని సూచించినట్లు తెలిపారు. త్వరలో తన అనుచరులతో కలిసి జిల్లా టిడిపి నాయకులు సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్లు మాగంటి అబ్బాయి తెలిపారు.



చంద్రబాబుకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మాగంటి అబ్బాయి

మొదటిపేజీ తరువాయి

కృష్ణా డెల్టా దుస్థితికి ప్రభుత్వమే కారణం



పంచడం వంటివి చేయడం ద్వారా నీచ బుద్ధిని బయటపెట్టుకున్నారని విమర్శించారు. ఎప్పుడో జరిగిన కష్ణా డెల్టా ఆధునికరణ పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించే ఎంఎల్ఏ రమేష్‌బాబు గత నాలుగేళ్లుగా ఎందుకు విచారించలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా సిబిఐ లేదా మరే ఇతర స్వతంత్ర సంస్థతోతైనా విచారించి ఆరోపణలను నిరూపించాలని బుద్ధప్రసాద్ సవాల్ విసిరారు. అతివష్టి, అనావష్టిలకు దివిసీమ రైతాంగం ఎప్పుడు గురవుతూనే ఉందని గుర్తుచేశారు. దివిసీమలో 72 వేల ఎకరాలకు సాగునీటిని, లక్షన్నరకుపైగా జనాభాకు తాగునీరందించే పులిగడ్డ అక్విడేట్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రూ.53 లక్షలతో టెండర్లు పిలిచి పనులు కూడా చేయించలేని అసమర్థత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తొలుత పులిగడ్డ వార్పు వద్ద ఉన్న సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి బుద్ధప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు అనంతరం రైతులతో కలిసి ర్యాలీగా బయలుదేరి అక్విడెక్ట్ వద్దకు వచ్చి అక్కడ సామూహిక సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్‌రామ్, మోపిదేవి జడ్‌పిటిసి సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, మోపిదేవి ఎంపిపి రావి దుర్గావాణి, చల్లపల్లి ఎంపిపి కోట విజయ రాధిక, టిడిపి నాయకులు కె.వెంకటేశ్వరరావు, బాలకోటయ్య, పి.కష్ణకుమారి, డి.యుగంధరి, బి.నాగ వెంకట కనకదుర్గ, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకష్ణ, ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై ప్రత్యేక దృష్టి

జాతీయ రహదారికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడుతుందన్నారు. ఈ రహదారిలో ఉన్న లోపాలను సరిదిద్ది అవసరమైన చోట్ల అండర్ పాస్ నిర్మాణాలను పూర్తి చేయాలని, కంకిపాడు - పామర్రు ప్రాంతంలో లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జాతీయ రహదారి 16లో ఫేజ్ - 3, ఫేజ్ - 4 లలో ఎదురయ్యే సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను సూచించామన్నారు. హైదరాబాద్ - గుంటూరు జాతీయ రహదారిని కలుపుతూ కష్ణానదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు 60 శాతానికిపైగా పూర్తయ్యాయని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించామన్నారు. విజయవాడ నుండి గన్నవరం జాతీయ రహదారివైపు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో విజయవాడ నోవాటెల్ హోటల్ నుండి నిడమానూరు వరకూ ఫ్లైఓవర్‌ను నిర్మించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హైవే అథారిటీ అఫ్ ఇండియా అధికారులు నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, జి.దుర్గాప్రసాద్, జి.పద్మ, శాసనసభ్యులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, కొలుసు పార్థసారథి, వసంత కష్ణ ప్రసాద్, అనిల్ కుమార్, సింహాద్రి రమేష్ బాబు, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీ రావు, పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్లు పి.సంపత్ కుమార్, డాక్టర్ అపరాజితా సింగ్, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్, రెండు జిల్లాలకు చెందిన ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూఎస్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

28న 'ప్రావిడెంట్ ఫండ్ మీ ముంగిట' కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఉద్యోగుల భవిష్య నిధి జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు భవిష్య నిధి పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటా దార్లు, లబ్ధిదారులతో నిధి ఆప్కే నికత్ (ప్రోవిడెంట్ ఫండ్ మీ ముంగిట) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ ఎస్.శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవిష్య నిధి పథకాలు, సేవలపై వాటాదార్లకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోని వారికి రెండు దశలుగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి చిట్టినగర్‌లోని విజయ డెయిరీ, కృష్ణాజిల్లాకు సంబంధించి తుక్కులూరులోని కోరమండల్ పెయింట్స్‌లో సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమవేశాలను యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటాదార్లు, లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దష్టికి తీసుకురావాలని సూచించారు.

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE KRISHNA AT VIJAYAWADA
POP 2/2019

Between
1) Undeti Sowri (2) Undeti Joseph ... Petitioners
And
1) Kadimi John Surendar and 8 others .... Respondents

NOTICE TO RESPONDENTS 4, 7 TO 9

R4) ప్రతాప్ తండ్రి : పేరు తెలియదు, డోర్ నెం.20-4-1/ఎ, ఫస్ట్‌పోర్షన్, శాంతినగర్, జీరోలైన్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగేశ్వరపేట, విజయవాడ-3.
R7) వంశీ, తండ్రి : పేరు తెలియదు, డోర్ నెం. 20-4-1/ఎ, 3వ పోర్షన్, శాంతినగర్, జీరోలైన్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగేశ్వరపేట, విజయవాడ-3.
R8) వై.భానుసుధాకర్, తండ్రి : పేరు తెలియదు, డోర్ నెం. 20-4-1/ఎ, మొదటి అంతస్తు,శాంతినగర్, జీరోలైన్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగేశ్వరపేట, విజయవాడ-3.
R9) బోరగ యాకోబు, తండ్రి : పేరు తెలియదు, మొదటి అంతస్తు, 20-4-1/ఎ, శాంతినగర్, జీరోలైన్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామలింగేశ్వరపేట, విజయవాడ-3.

పైన చెప్పిన రెస్పాండెట్సు వారు నివాసం అద్దెకు వుంటున్నారు. వారి అడ్రస్సులు పైన పేర్కొనబడినది. ఈ దావాలో కోర్టు నుండి నోటీసులు కోర్టుద్వారా, పోస్టు ద్వారా నోటీసులు పంపిననను తీసుకొనక, కాలయాపన చేస్తున్నారు. కనుక కోర్టు ఉత్తర్వులు ప్రకారం ఈ నోటీసు జారీ చేయడమైనది. పై దావా విచారణ నిమిత్తం ది. 08-09-2023న వాయిదా అయివున్నది. కనుక పైన చెప్పిన కోర్టుకు ది. 8-9-2023న ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు తెలుపు కొనవలయును. లేనిచో పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

విజయవాడ
ది.25-8-2023

కె.శ్రీరామమూర్తి, న్యాయవాది,
డోర్ నెం. 14-20-26, గాంధీనగర్,
విజయవాడ- 520 003.
సెల్ : 9246473270.

డాక్యుమెంట్ పోయింది

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు కాకాని కిరణ్ కళ్యాణి భర్త వెంకటకృష్ణ లేటు డాక్యుమెంట్ నెంబర్ 949/2008, గోపినేనిపాలెం నుండి వత్సవాయి బైకుపై వెళుతుండగా మార్గమధ్యలో డాక్యుమెంట్ పోయింది. జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 173/1C5, లో రెండు ఎకరాల భూమి కలదు. దొరికిన వారు ఈ క్రింది నెంబర్ కు తెచ్చి ఇవ్వగలరు. ఇట్లు, కాకాని కిరణ్ కళ్యాణి, భర్త వెంకటకృష్ణ లేటు, గోపినేనిపాలెం గ్రామం, వత్సవాయి మండలం, ఎన్టీఆర్ జిల్లా, సెల్ నెంబర్8519878378.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **భద్రాచలం బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొపి **శ్రీమతి రాసాల హారిక** భర్త : రాసాల మల్లిఖార్జునరావు, వయస్సు : 27 సం॥, నివాసం : డోర్ నెం. 4, గవర్నమెంట్ హాస్పిటల్ క్వార్టర్స్, భద్రాచలం, భద్రాచలం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

కృష్ణా జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, కంచికచర్ల గ్రామపంచాయితీ ఏరియాలోని కంచికచర్ల గ్రామం తాలూకా సర్వే నెం. 450/2ఎ, 450/2బి ర్లు దాఖాల యం. 0.87/ 1/2 సెంట్లు మింజుమలే నాకు హక్కు గల ప్లాటు నెం. 15రు, దాఖలా 147.8 చ॥గ॥లు, **డాక్యుమెంట్ నెం. 3501/2018**, స్తిరాస్థి ఖాళీ నివేశన స్థలంనకు హద్దులు : **తూర్పు** : 20 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణము** : ప్లాటు నెం.14రు దాఖలా స్థలము, **పడమర** : బచ్చు కోటేశ్వరరావు గారి భూమి, **ఉత్తరం** : ప్లాటు నెం. 16 రు దాఖలా స్థలము.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం,సెల్ : 9849246278

IN THE COURT OF THE VI Addl. DISTRICT JUDGE AT MACHILIPATNAM
ARBEP NO;84/2023

Between;
The Kamalalaya Mutually Aided Co-Operative Credit Society Limited, Machilipatnam. ... DHR
AND
Kurella Lakshmi Rekha ....J D R
Kurella Lakshmi Rekha, W/o Ravi Kanth, Hindu, aged about 39y, resident of D.No 20-585-21A, Vinayak Nagar, Lakshmana puram, Machilipatnam.

Whereas above E.P. is posted to on 05-09-2023 for your appearance, so you shall appear on 05-09-2023 at about 10-30 am either by in person or through your pleader or Advocate before the Hon'ble court, otherwise the court decided the matter in your absence, as if you fail to appear i.e ex-party Order may be order. It is for your notice.

By order of court

Machilipatnam,
25.08.2023.

N.Rajani Kumari,
Advocate
D.No.11/136
C/o Kamalalaya Maccs Ltd
Chemmanagiripet,
Machilipatnam.

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT : VIJAYAWADA
I.A. No. 339/2020
in
A.S. No. 110/2012

Between
Gandrala Sarojini ... Petitionr / Appellant
And
Vajrala Basivi Reddy & 5 others .... Respondents / Respondents

To,
1) M/s Subhadarsi Housing Pvt. Ltd., registered under Companies Act, having Office at temple street, Labbipet, Vijayawada... Respondent No.3
2) Vaalisetti Venkat Siva Satyanaayana, S/o Prakasa Rao, R/o Gopovani palem, Pothireddypalem, Machilipatnam, Krishna District. ... Respondent No.4
3) Garapati Ramalingeswara Prasad, S/o Bhaskara Rao, R/o SF-2, Tonia Residency, Mega Townhip, Ayyappa Nagar, Patamata, Vijayawada ... Repondent No.5
4) Gorla Sridevi, W/o Manikyala Rao, □B□ Flat, 4th Floor, Donka Road, Patamata, Vijayawada. ... Respondent No.6

పై నెంబరు గల I.A. No. 339/2020 (Petition for the Restoration of the Appeal) in A.S. No. 110/2012 అప్పీలులో Respondent Nos.3,4,5&6 అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపనచేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుటకు శ్రీ కోర్టువారు కేసును వాయిదావేసియున్నారు. ది. 20-9-2023 తేదీన ఉదయం 10-30 గం.లకు సదరు పై కోర్టుయందు I.A. No. 339/2020 in A.S. No. 110/2012 అప్పీలులో Repondent Nos. 3,4,5 & 6 అయిన మీరు కానీ లేక మీ తరపున న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల సదరు దావాను మీ పరోక్షమందు తీర్మానించ గలరని యిందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదాతేది: 20-9-2023

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం

చనుమోలు జగదీష్,
అడ్వకేట్,
డోర్‌నెం. 29-14-24, ఫస్ట్‌ఫ్లోర్,
ఐ.వి.ప్యాలెస్ ఎదురు,
ప్రకాశంరోడ్డు, గవర్నరుపేట,
విజయవాడ- 520 002.
ఫోన్ : 9866682222

IN THE COURT OF THE 2nd SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
E.P. No. 57/2020
in
O.S. 500/2016

Between
P.V.Srinivasa Sesha Sai .... DHR
And
Ghantasala Lakshmi Ravi Kiran, S/o Rama Mohana Rao, R/o D.No. 1-81/1, Indira Nagar, Khanapuram Haveli, Khammam .... JDR

పై నెంబరు దావాలో యిందలి డిహెచ్‌ఆర్ తన యొక్క డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై నెంబరు ఇ.పి.ని ఇందలి జెడిఆర్ అయిన మీపై దాఖలు చేసియున్నారు. ఇట్టిస్థితిలో పై తెలిపిన కోర్టువారు పలుమార్లు Order 21 Rule 66 Noticeలు వారి కోర్టు నుండి పంపించి యున్నారు. అట్టి నోటీసులు మీరు తీసుకొనకుండా కావాలనే కాలయాపన చేయుచున్నారు. ఇట్టిస్థితిలో పై నెంబరు ఇ.పి. ది. 11-9-2023వ తేదీనకు మీ యొక్క అప్పీరెన్స్ కొరకు వాయిదా అయివున్నది. కావున మీరు ప్రత్యక్షంగా గానీ, లేక అడ్వకేటు ద్వారా గానీ పై తెలిపిన కోర్టు యందు ఉదయం 10-30 గం.లకు హాజరు కాగలరు. లేనిచో మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదాతేది : 11-9-2023

(శ్రీ కోర్టువారి అనుమతితో)

విజయవాడ
తేది:24-8-2023

బి.నాంచారయ్య,
బి.జ్యోతి,
అడ్వకేట్స్,
మెయిన్‌రోడ్డు, కంకిపాడు.
ఫోన్ : 9493151848



క్రీడల్లో సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు విద్యార్థుల విజయధంకా

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక సెయింట్ ఫ్రాన్సిస్ స్కూలు విద్యార్థులు అత్యధిక మెడల్స్ సాధించి విజయ ధంకా మోగించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించిన కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికేట్ ఎగ్జామినేషన్స్ (సిఐఎస్సిఇ) రీజనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్, హైదరాబాదులో నిర్వహించిన క్రీడలలో 6 గోల్డ్, 2 సిల్వర్, 7 బ్రొంజ్ మెడల్స్ ను మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్ విద్యార్థులు కైవసం చేసుకుని విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కరెస్పాండెన్స్ ఫాదర్ వల్లి విజయ్ జోజి బాబు, పలువురు ప్రముఖులు, తల్లిదండ్రులు విజేతలకు అధినందనలు తెలిపారు.



గోతులమయంగా ఉన్న రహదారి

జడ్‌పి రహదారి గోతులమయం

ప్రజాశక్తి-పెదపారుపూడి : భూషణగోళ్ళ గ్రామంలో ప్రధాన రహదారి జడ్పీపి రోడ్డుపై గతుకులమయంగా మారి నడవడానికి ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై వర్షం పడగానే చెరువులను తలపిస్తున్నాయని అంటున్నారు. రాత్రిపూట వెళ్లాలంటే వాహన దారులు గోతుల్లో పడతామని భయపడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు



మానవత భవన నిర్మాణానికి విరాళం

హనుమాన్‌జంక్షన్ : హనుమాన్ జంక్షన్ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతనంగా ఏలూరు రోడ్ లో నిర్మిస్తున్న శాశ్వత భవనానికి మానవతా కన్వీనర్ గంటా సత్యనారాయణ,ఇందిరా దేవి దంపతులు 25వేల రూపాయలు విరాళం మానవతా అధ్యక్షులు కూరెళ్ళ సుబ్బాచారి కి అందించారు.ఈ కార్యక్రమంలో మానవత రాష్ట్ర అధ్యక్షులు మారుబోయిన కోటేశ్వరరావు , కళ్ళేపల్లి నారాయణరావు, వడ్డీ రాజేశ్వరరావు, నారగాని కొండలరావు ,వేగిరెడ్డి సూర్యనారాయణ, పివి చలం, జన్యవుల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం : విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ గన్నవరం సబ్ స్టేషన్ పరిధిలో 11కె.వి శ్రీనివాస ఫీడర్ లో శనివారం ఉదయం 08 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి. హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దావాజీగూడెం. అల్లాపురం. పామర్తి నగర్ సెంటర్, పాలిటెక్నికల్ కాలేజ్ రోడ్డు.రైస్ మిల్ బజార్. రాజీవ్ కాలనీ. ఎస్‌టిబిఎల్ కాలనీ .మల్లికార్జున స్కూల్ రోడ్డు. ఆ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

ప్రమాదంలో భారత రాజ్యాంగం : సిపిఐ



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : కేంద్రంలో బిజెపి నేతత్వంలోని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యాక భారత దేశ రాజ్యాంగ ప్రమాదంలో పడిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకష్ణ ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రాన్ని రక్షించండి! దేశాన్ని కాపాడండి అంటు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాతా బస్సు యాత్ర లో బాగంగా శుక్రవారం యాత్ర మచిలీపట్నం చేరుకుంది. ఈ నేపథ్యంలో సి పి ఐ,మచిలీపట్నం ఏరియా సమితి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో రాజ్యాంగ హక్కుల బి పరిరక్షణ కై అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పై నమ్మకం లేని వాళ్ళు ఈ రోజు అధికారంలో ఉన్నారన్నారు. కేంద్రంలో బి జే పీ మూడో సారి అధికారంలోకి వస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యంగం ఉండదని ఆర్ ఎస్ ఎస్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాజ్యాంగ వ్యవస్థలన్నిటిని నిర్వీయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన వారే ఈ విధమైన చర్యలకు దిగుతుంటే ఇంకా రాజ్యాంగ పలాలు ప్రజలకు ఏ విధంగా అందుతాయని ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కేంద్రంలోని మోడీ చేస్తున్న రాజ్యాంగ నిర్వీర్య చర్యలను ఖండించకుండా వత్తాసు పలకడం దుర్మార్గం అన్నారు. కేంద్ర కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అధ్యక్షత వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎంపీ, టీడీపీ కష్ణా జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, మహిళా సంఘం రాష్ట్ర నాయకులు,దుర్గ భవాని, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు కె.చంద్రశేఖర్, అబ్దుల్ మతిన్, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు ఆర్ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యవసర సరుకులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల కృష్ణా నదికి వచ్చిన వరదల వల్ల ఇబ్బందులు పడ్డ పాత ఎడ్లలంక గ్రామస్తులకు మచిలీపట్నానికి చెందిన పే యిత్ టెంపుల్ మినిస్ట్రీస్ బిషప్ గాడెల్లి పరిశుద్ధ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో నిరుపేదలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 20 కేజీల బియ్యం కూరగాయలు నిత్యవసర సరుకులైన పప్పు దినుసులు 200 కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 1500 రూపాయల ఖరీదు చేసే వస్తువులను పంపిణీ చేశారు. వరదల వల్ల విపత్తులు వచ్చి పనులేక అల్లాడుతున్న పేదలకు ప్రత్యేక ఆ సమస్త వారు చేస్తున్న సహాయానికి గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. సంస్థ మేనేజర్ తాడేపల్లి రాజా, గాడెల్లి ఐజయ్య వారి బందం పాల్గొనగా ఎడ్ల లంక చర్చి పాస్టర్ విలియం కేరి అధ్యక్షతన ఈ వస్తువులను అందజేశారు.

సమస్యల పరిష్కారంలో ఎంఎల్‌ఎ విఫలం : వెనిగండ్ల



విలేకరుల సమావేశ:లో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

ప్రజాశక్తి-గుడివాడ : బూతుల నాని గంజాయి మత్తులో పిచ్చివాగుడు వాగుతున్నాడని టిడిపి నేత వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏలూరురోడ్డులోని వెనిగండ్ల రాము తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సొల్లు చెప్పడంలో నానిను మించిన వాడు రాజకీయాల్లో లేడన్నారు. ఆగస్ట్ నెలలో కరెంట్ కోతలు వస్తున్నా వాటిని పరిష్కరిచడం మాత్రం చేతకాదని, వర్షాలతో నష్టపోయిన రైతులు కష్టాలు పడుతున్నా పట్టించుకోడని విమర్శించారు. బూతుల పంచాంగంతో ఎమ్మెల్యే పదవికి ఉన్న విలువ తీసేస్తున్నాడన్నారు. సినిమా చివర్లో విలన్ పరిస్థితే నానికి పడుతుందన్నారు. లోకేష్ వ్యాఖ్యలకు కొడాలి నాని భయపడి పిచ్చి వాగుడు వాగుతునట్లు కనిపిస్తుందన్నారు. ఈ సమావేశంలో షేక్ ఇబ్రహీం, గుడివాడ జోన్సు, సిరిపురపు తులసిరాణి, ఏసుపాదం, గడ్డం ప్రకాష్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపిపి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారులకి అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ఎంపీపీ కొడాలి సురేష్ అన్నారు. మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశము స్థానిక మండల పరిషత్ కార్యాలయములో కొడాలి సురేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమములో వైస్ యంపిపి పోలగాని రమాదేవి, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు మరియు సర్పంచులు పాల్గొన్నారు. సర్వ సభ్య సమావేశములో అన్ని శాఖల ప్రగతిపై సంబంధిత శాఖ అధికారులతో ఎంపిపి కొడాలి సురేష్, మండల పరిషత్ అభివద్ధి అధికారి దారపు శ్రీనివాస్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. సభ్యులు అధికారుల దష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సమీక్షించి తక్షణమే పరిష్కరించేలా సూచనలు జారీ చేశారు. ఉలవలపూడి గ్రామ సర్పంచ్ పామర్తి కన్నె భాస్కరరావు మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధిపనులు జరగడంలేదని, నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీ అబ్దుల్ రెహమాన్ మస్తానా, పంచాయతీల విస్తరణాధికారి వి దిలీప్ కుమార్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న రహదారి

అభివృద్ధికి నోచని యాకమూరు రహదారి

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక అడుసుమిల్లి గోపాలకష్ణయ్య మరియు చెరకు రైతుల సిద్దార్థ కళాశాల నుండి ఉయ్యూరు పబ్లిక్ స్కూల్ మీదుగా యాక మూరు వెళ్లే రోడ్డు ఏళ్ల తరబడి అభివద్ధికి నోచుకోక గోతుల మయంగా తయారవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. యాకమూరు నుండి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు, గ్రామస్తులు సైకిల్ పై ఈరోడ్డుపై నుండి రావాలంటే గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. వర్షం కురిస్తే గోతుల్లో నీరు నిలిచి రాకపోకలకు వీలులేక ఉయ్యూరు, యాకమూరు ప్రజలకు అసౌకర్యం కలుగుతుంది. ఈరోడ్డులో మెట్ట పొలాల నుండి వ్యవసాయ ఉత్పత్తులు రవాణ చేసేందుకు వాహనాలు రాక రైతులు అవస్థలు పడతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని ప్రజ కోరుతున్నారు.



రైతులకు సూచినలిస్తున్న అధికారులు

తరకటూరులో 'పొలంబడి'

ప్రజాశక్తి-గూడూరు : సమగ్ర పంటల యాజమాన్యాన్ని అమలు పరుస్తూ శాస్త్రీయ మైన సేంద్రియ వ్యవసాయం దిశగా సాగు చేస్తూ ఆర్థికంగా రైతుని బలోపేతం చేయటానికి జరిపే ఒక వినూత్నమైన కార్యక్రమమే పొలంబడి అని మండల వ్యవసాయ అధికారి జివి శివప్రసాద్ అన్నారు.14 వారాల పాటు మండలం లోని గ్రామ వ్యవసాయ సహాయకుల పర్యవేక్షణ లో తరకటూరు లో సేంద్రియ పొలంబడి జరుగుతోంది.. మూడవ వారం లో భాగంగా శుక్రవారం ఒక చదరపు మీటర్ లో మొక్కల సాంధ్రతను లెక్కించారు. ఆరోగ్యవంతమైన పైరును పెంచటం, మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ ప్రతి వారం పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి రైతు లను తన పొలం పనులలో నిష్ణాతుని గా చేయటమే గ్రామ వ్యవసాయ సహాయకుల తక్షణ కర్తవ్యం అని శివప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తరకటూరు రైతులు, గ్రామ సహాయకులు ఇందులో పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి నుంచీ దివిసీమ రైతు పోరుబాటకు పులిగడ్డలో మాజీ ఉపసభాపతిమండలి బుద్ధప్రసాద్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మద్దతుగా చల్లపల్లి నుండి బారీ గా తెలుగు దేశం పార్టీ నేతలు ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షులు మోర్ల రాంబాబు,సర్పంచ్ పు. కష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక ఎంపీటీసీ సభ్యులు కి. స్వప్న, రాజులపాటి అంకమ్మ,, రావి చిట్టీ, జన్ను నాంచారయ్య, నిడమానూరు దిలీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీక్షకు బయలుదేరుతున్న టిడిపి నాయకులు

50 వేల కోట్లు దాటిన బజాజ్ ఫైనాన్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అగ్రశ్రేణి వైవిధ్యభరితమైన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటైన బజాజ్ ఫిన్‌సర్వ్‌లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ల ఖాతా రూ.50,000 కోట్ల మైలురాయిని దాటినట్లు బజాజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫిక్స్‌డ్ డిపాజిట్స్, ఎఎంపి, ఇన్వెస్ట్‌మెంట్స్ సచిన్ సిక్కా తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బజాజ్ ఫైనాన్స్‌కు అయిదు లక్షల మందికి పైగా వినియోగదారులున్నారన్నారు. ప్రతి డిపాజిటర్ 2.87 డిపాజిట్లను, మొత్తంగా 14 లక్షల డిపాజిట్లను కలిగి ఉన్నామన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ దీర్ఘకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం అత్యున్నతమైన ఏఏఏ/ స్టేబుల్ క్రెడిట్ రేటింగ్‌ను బజాజ్ ఫైనాన్స్ కలిగి ఉందన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ స్వల్ప కాలిక రుణ కార్యక్రమం నిమిత్తం ఏ10ను, క్రిసిల్, ఐసిఆర్ఎల నుంచి తమ ఫిక్స్‌డ్ డిపాజిట్స్ కార్యక్రమం నిమిత్తం ఏఏఏ(స్టేబుల్) రేటింగ్‌ను కలిగి ఉందన్నారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో మా వినియోగదారులకు దీర్ఘకాలిక పొదుపు పరిష్కారాలను అందించడంపై దష్టి కేంద్రీకరించామని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల పోర్ట్ ఫోలియోలో వేగవంతమైన, గత రెండేళ్ళలో రెట్టింపైన వద్ధి బజాజ్ ఫైనాన్స్ బ్రాండ్ మీద ఉందన్నారు.

ప్రతి ఒక్కరూ నేత్రదాన ప్రతిజ్ఞ చేయాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ప్రతి ఒక్కరూ నేత్ర దాన ప్రతిజ్ఞ చేయాలని ఎల్‌వి ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ వైద్యులు డాక్టర్ అరవింద్ రాయ్ అన్నారు. నేత్రదాన అవగా హనా కార్యక్రమం తాడి గడపలోని ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 10 మిలియన్ అంధులలో 2 మిలియన్ మంది కార్నియల్ అంధత్వం బారిన పడుతున్నారన్నారు. ఇందులో 60 శాతం మంది 12 ఏళ్ల వయసులోపు వారు ఉన్నారని వీరు కార్నియా సంబంధిత వ్యాధి, గాయం లేదా ఇన్ఫెక్షన్ కారణంగా రావచ్చని తెలిపారు. కంటి సమస్యలకు సంబంధించి కార్నియా మార్పిడి మాత్రమే తెలిసిన చికిత్స అని దీనికి గణనీయమైన సంఖ్యలో నేత్రదానం అవసరం అన్నారు. కానీ నేత్రదాన సంబంధిత అపోహలు భయాలతో పాటు అవగాహన లేకపోవడం వలన నేత్రదానం చేసే వారి సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. నేత్రదాన ఉత్సవాల సందర్భంగా నేత్రదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.



వాహనాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఇ.వి. ద్విచక్ర వాహనాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ ఆధ్వర్యంలో ఈవీ ద్విచక్ర వాహన విభాగంలోని ప్రవేశించినట్లు గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ సీఈవో హైదర్ ఖాన్ తెలి పారు. నగరంలోని ఓ హోటల్‌లో ఎలక్ట్రిక్ వాహ నాలు ఆయన విడుదల చేశారు. అనం తరం మాట్లా డుతూ ఇందులో భాగంగా మొట్ట మొదటి కుటుంబ ఇ స్కూటర్ ఎబ్లూను విడుదల చేసినట్లు తెలిపారు. ఈవీ ద్విచక్ర వాహన విభాగంలో కంపెనీ నుండి వచ్చిన మొదటి ఉత్పత్తి అన్నారు. ఎబ్లూ కోసం ఫ్రీ బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభించామని, ఆగస్టు 23 నుండి డెలివరీలను కూడా ప్రారంభించినట్లు తెలిపారు. సింగిల్ వేరియంట్లో లభించే ఈ స్కూటర్ ధరను వినియోగదారులకు రూ.99,999లుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కంపెనీ ప్రస్తుతం దేశంలో ఎబ్లూ రోజీ, ఎబ్లూ స్పిన్, ఎబ్లూ థ్రిల్ శ్రేణి వాహనాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు.

పాడిపరిశ్రమకు సహకారం అందించండి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడలోని వివాంటా హోటల్‌లో నగరానికి విచ్చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి పశు పతి కుమార్ పరాస్‌ను కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం మర్యాద పూర్వకముగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భముగా కష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు అందిస్తున్న ధర, బోనస్, పాడి రైతు మరియు పశు సంక్షేమ కార్యక్రమాలు గురించి కేంద్ర మంత్రికి వివరించారు. పాడి పరిశ్రమలోని కో- ఆపరేటివ్ డెయిరీల అభివద్ధికి సహాయ సహకారములు అందించాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో కష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు పాల్గొన్నారు.


కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని అంజనేయులు, డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు

సమగ్ర ఓటర్ల జాబితానే లక్ష్యం


ఓటర్ జాబితాపై ఓటర్లను స్వయంగా అడుగుతున్న కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : పారదర్శక ఓటర్ జాబితా సమగ్రతను నిర్ధారించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలనా కార్యక్రమం జరుగుతుందని సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ), నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని 32 వడివిజన్ లోటస్ దగ్గర రామలింగేశ్వర పేట, 57 వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీ పేట లోని పోలింగ్ స్టేషన్ 1,2,4,5,6,7, 8 బిఎల్వో యాప్ ద్వారా నిర్వహించిన ఓటర్ల జాబితా పరిశీలనా కార్యక్రమాన్ని కమిషనర్ శుక్రవారం పరిశీలించి, జరుగుతున్న తీరును స్వయంగా ఓటర్ల నుంచే సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఓటర్ లిస్ట్ రీ వెరిఫికేషన్ ప్రక్రియలో తొలగింపులు, స్థాపిత నిబంధనలకు అనుగుణంగా ,తగిన డాక్యుమెంటేషన్తో జరుగుతున్నాయో లేదా అని సంబంధిత సిబ్బంది నుంచి కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాలకు కట్టుబడి ఉండేలా మరణం , తరలింపు వంటి కారణాలతో అనివార్యమైన ఈ తొలగింపులను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. బిఎల్ఒలు ప్రతి ఇంటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితాను నిశితముగా పరిశీలించి, కొత్త ఓటర్ల నమోదులు, మార్పులు, చేర్పులు , చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి వాటికి ఫారం-6, 6ఎ, 7, 8 ఫారములను అందించి దరఖాస్తులను స్వీకరించి మొబైల్ యాప్ అప్ లోడ్ చేశారా లేదా అని స్వయంగా కమిషనర్ ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు, సూపర్వైజర్ అధికారులు, బిఎల్ఓలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బిఎస్ఎన్ఎల్ లోని అర్హులైన కార్యనిర్వాహకులందరికీ పదోన్నతి కల్పించాలని ఆలిండియా గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎఐజిఇటివోఎ) అఖిల భారత అధ్యక్ష, ప్రదాన కార్యదర్శిలు జి.వీరభద్రరావు, రవి పీల్ వర్మ తెలిపారు. చుట్టుగుంటలోని బిఎస్ఎన్ఎల్ భవన్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్‌లోని ఎగ్జిక్యూటివ్ అసోసియేషణ్ యొక్క సభ్యత్వ ధృవీకరణలో భాగంగా విజయవాడ అసోసియేషన్‌ను అఖిల భారత జనరల్ సెక్రటరీ సందర్శించారని తెలిపారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలోనూ, అంతకుముందు బిఎస్ఎన్ఎల్ తీవ్ర నష్టాల్లో ఉన్న సమయంలో ఉద్యోగులంతా కష్టపడి పనిచేసి ప్రస్తుత బిఎస్ఎన్ఎల్ సంస్థలకు లాభాలను తీసుకురావడంలో మంచి కృషి చేశారని తెలిపారు. ఎప్పటికపుడు కొత్త కొత్త పథకాలను ప్రారంభిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. కరోనా సమయంలోనూ ఆతరువాత ఉద్యోగులు కష్టపడి పనిచేసినా వారికి తగిన విధంగా ప్రోత్సాహకాలు అందలేదన్నారు ప్రదానంగా అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతి అవకాశం కల్పించాలని తెలిపారు. జెటివో, జెఎఓ, అలాగే ఎస్‌డిఇ, వో కోసం ప్రామాణిక పే స్కేల్‌లు ఇ2, ఇ3లు అలానే ఉన్నాయని వీటిని సవరించాల్సిన అవసరం ఉందని తె లిపారు. విఆర్ఎస్, రిటైర్ అయిన ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. 1.1.2017 నుండి మూడవ పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించి వైర్లు తెగిపోవడం, కనెక్టివిటీ లేకపోవడం వంటి సమయాలలో కూడా ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఉద్యోగులకు సంబంధించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గ్రాడ్యుయేఉట్ ఇంజనీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ కన్వీనర్ అండ్ చీఫ్ ప్యాట్రన్ ఆఫ్తాబ్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఫజల్ అ హ్మద్, జాయింట్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరభద్రరావు

మార్కెట్లోకి న్యూ గ్లామర్ సింప్లీ మేగ్నెటిక్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ద్విచక్ర వాహనం ప్రియులకు హీరో మోటార్ కంపెనీ సరికొత్త మోటార్ వెహికల్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. హీరో కంపెనీ అధీకత డీలర్లైన ఆర్ఎం మోటార్ విజయవాడ షోరూం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కంపెనీ ఏరియా మేనేజర్ విజయ్ కన్నన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీరో కంపెనీ రూపొందించిన గ్లామర్ వేరియంట్ వెహికల్ మార్కెట్లో సరికొత్త రికార్డు సష్టిస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాహన రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దానికి అనుగుణంగా నూతన గ్లామర్ వెహికల్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, న్యూ నవ్య అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు, కస్టమర్లు పాల్గొన్నారు.



న్యూ గ్లామర్ బైక్ విడుదల చేస్తున్న షోరూమ్ ప్రతినిధులు


దుర్గమ్మ దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి దంపతులు

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వెలంపల్లి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను విజయవాడ నగర పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు దంపతుల వారు శ్రీ అమ్మవారి దర్శనార్థం శుక్రవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు మరియు ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేద పండితులు వేదాశీర్వచనము చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మరియు కార్యనిర్వా హణాధి కారి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం అందజే శారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి.శిరీష

నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి, విజయవాడ అర్బన్ - మరణించిన వారి నేత్రాలతో అంధుల జీవితాల్లో వెలుగు వస్తుందని, ప్రతి ఒక్కరూ మరణాంతరం నేత్రదానానికి తమ సంకల్పాన్ని తెలియ చేయాలి" అని ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ బ్లైండ్‌నెస్ కంట్రోలు సొసైటీ డిస్ట్రిక్స్ ప్రోగ్రామ్ మేనేజర్ డా. పి.శిరీష అన్నారు. బెంజ్ సర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలోని నేత్రదాన ప్రచార పక్షోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ ద్వారా అంధత్వ నివారణకు రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నేత్రదానం విషయంలో స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ చేస్తున్న కషి అమోఘమైందన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సమరం మాట్లాడుతూ, గత 28 ఏళ్ళుగా నల్లగుడ్డు అంధత్వ విషయంలో ఈ ఐ బ్యాంక్ గణనీయమైన కషి చేస్తోందని, ఇంతవరకు 892 మందికి రెండు కళ్ళ అంధత్వం ఉన్నవాళ్ళకి చూపుని ప్రసాదించి వాళ్ళ జీవితాలని ఎంతో సుఖంగా మలిచామని అన్నారు. ఈ ప్రచార పక్షోత్సవాల ప్రారంభ సభకి అధ్యక్షత వహిస్తున్న డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ నల్లగుడ్డు అంధత్వ నివారణ విషయంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ఈ సందర్భంలో స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్‌కి తమ అమూల్యమైన సేవలందిస్తున్న డా. పి.ప్రభాకరశాస్త్రి, డా. కె.విజయశేఖర్‌లను సత్కరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ కార్యదర్శి ఆర్.రాము మాట్లాడారు. తొలుత స్వేచ్ఛాగోరా ఐ బ్యాంక్ మేనేజర్ డి.రవికుమార్ అతిథులని వేదికపైకి ఆహ్వానించగా, వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి వందన సమర్పణ చేశారు. సభలో డా. మారు, నియంత, హరిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.